సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 8 । జూన్ । 2025





## ఆలయ నిర్మాణానికి విరాళం


యానాం: స్థానిక శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన ఆలయం నిర్మాణానికి కోన శ్రీనివాస్ సోదరులు (కనకాలపేట) రూ.50,112 శనివారం విరాళం అందజేశారు.



## నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి తోట రిషితశ్రీ దంపతులు (గుంటూరు) శనివారం రూ.1,00,011 విరాళం సమర్పించారు.

## డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 కలిపి మొత్తం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 16,686 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

## న్యూస్‌రీల్

### ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

రాయవరం: ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకండియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు మే నెలలో సప్లిమెంటరీ పరీక్షలు రాశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 34 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 3,315 మంది పరీక్షలకు హాజరు కాగా 1,137 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 947 మందికి 380 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 2,508 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,122 మంది ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ విభాగంలో 826 మంది పరీక్షలకు హాజరు కాగా, 454 మంది ఉత్తీర్ణత సాధించారు.

### సీనియర్ సిటిజన్లతో నేడు యోగా ప్రదర్శన

అమలాపురం రూరల్: యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ సీనియర్ సిటిజన్లతో ప్రత్యేక యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం మెట్ల సత్యనారాయణ పార్క్, కొత్తపేట ఎంపీడీఓ కార్యాలయం, రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ కళాశాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

### నేటి నుంచి రీచ్‌లలో ఇసుక విక్రయాలకు బ్రేక్

అమలాపురం రూరల్: రుతు పవనాలు సమీపిస్తున్నందున జిల్లాలోని 20 బహిరంగ రీచ్‌లలో ఆదివారం నుంచి ఇసుక విక్రయాలు నిలిపివేస్తున్నట్టు కలెక్టర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై స్టాక్ యార్డుల ద్వారా మాత్రమే ఇసుక విక్రయాలు జరుగుతాయని స్పష్టం చేశారు. రావులపాలెం, గోపాలపురం, జొన్నాడ, ఆత్రేయపురం, తాతపూడి, అమలాపురం, ఊబలంక-1, 2, వద్దిపర్రు-1, 2, పొడగట్లపల్లి-1, 2, కపిలేశ్వరపురం, ఆలమూరు, పులిదిండి, ఆత్రేయపురం మండలం అంకంపాలెం, నార్కెడ్‌మిల్లి తదితర రీచ్‌లలో ఇసుక విక్రయాలు నిలుపు చేస్తున్నామని వివరించారు. ఈ 20 రీచ్‌లకు వెళ్లే మార్గాల్లో కందకాలు తవ్వి, ఇసుక తవ్వకాలను నిషేధిస్తామని వెల్లడించారు.

### 11న మహాజ్యేష్టాభిషేకం

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి మూలవరులకు ఈ నెల 11న జ్యేష్టా నక్షత్ర పర్వదినం సందర్భంగా మహాజ్యేష్టాభిషేకం నిర్వహిస్తున్నారు. దీనికి అవసరమైన సప్త నదీ జలాలతో కూడిన కలశలను అర్చకులు శనివారం ఆలయానికి చేర్చారు. ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని భద్రపరిచారు. సప్త నదులైన గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి పవిత్ర జలాలతో మహా జ్యేష్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నామని ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ తెలిపారు. ఆ రోజు ఉదయం విష్వక్సేన పూజతో విశేషాభిషేకానికి శ్రీకారం చుడతామని, అనంతరం సప్తనదీ జలాలతో అభిషేకించి, మహా శాంతి హోమం నిర్వహిస్తామని స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి అన్నారు. సూపరింటెండెంట్ పి.విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

### అప్పనపల్లిలో భక్తజన కోలాహలం



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్నానఘట్టంతో పాటు పాత గుడి, కొత్త ఆలయం, కల్యాణకట్ట వద్ద భక్తుల సందడి నెలకొంది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారికి తలనీలాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాల బాలాజీ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.4,16,615 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారిని 5,800 మంది దర్శించుకున్నారని, 3,500 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని వివరించారు. లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.83,955 వచ్చిందన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.86,273 విరాళాలుగా సమర్పించారని తెలిపారు.

## నాడు తు.చ. తప్పకుండా..

# నేడు ఏదీ ఇవ్వకుండా..

- మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నవరత్నాల పేరిట ప్రతి వర్గానికీ సంక్షేమం
- మేనిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు
- నేడు అమలుకు నోచని టీడీపీ మేనిఫెస్టో
- అన్ని వర్గాలకూ దగా




అమలుకు నోచని టీడీపీ సూపర్ సిక్స్ మేనిఫెస్టో

సాక్షి, అమలాపురం: తాము అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటిస్తుంటాయి. తద్వారా ప్రజల మనసులను చూరగొని అధికారంలోకి వస్తుంటాయి. గద్దెనెక్కిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేస్తుంటాయి. మరికొన్నింటిని వదిలేస్తాయి. అయితే, మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీనీ నెరవేర్చటమే కాకుండా అందులో చెప్పని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నెరవేర్చిన అరుదైన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇదే సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన ఒక్క హామీ కూడా అమలు చేయని అప్రతిష్టను కూటమి ప్రభుత్వం మూటగట్టుకుంటోంది.

### నాడు సంక్షేమ క్యాలెండర్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టో ప్రకారం ప్రతి సంక్షేమ పథకాన్నీ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తు.చ. తప్పకుండా అమలు చేశారు. సంక్షేమ పథకాల అమలుకు ఏకంగా క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచారు. అంతే కాదు.. మేనిఫెస్టోలో ప్రకటించని సంక్షేమ పథకాలను కూడా అమలు చేశారు. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారు.

నాడు-నేడు, విదేశీ విద్య, ఆరోగ్యశ్రీలో చికిత్సల సంఖ్య, వ్యయ పరిమితి పెంపు, జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దనే మెరుగైన వైద్యం వంటి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఆయన ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో కేవలం సంక్షేమ, సహాయ కార్యక్రమాల ద్వారానే జిల్లా ప్రజలకు సుమారు రూ.3,500 కోట్ల మేర లబ్ధి చేకూరిందని అంచనా. రెండేళ్ల పాటు కరోనా విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థికంగా ఇబ్బందులు పడినా కూడా లెక్క చేయకుండా సంక్షేమ పథకాలు అందించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమాన్ని అందించిన నవరత్నాలు



### నేడు మభ్యపెడుతూ..

గత ప్రభుత్వం అమలు చేసి, సంక్షేమం, ప్రగతి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పూర్తిగా తలకిందులైంది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ మేనిఫెస్టోలో ఊదరగొట్టారు. వాటితో పాటు పలు హామీలు గుప్పించారు. తీరా గద్దెనెక్కిన తర్వాత ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. సామాజిక భద్రతా పింఛన్ పెంపు మాత్రమే జరిగింది. అందులో కూడా క్రమంగా కోతలు పెడుతున్నారు. ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. గత ఏడాది ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారు. అది కూడా అర్హులైన లబ్ధిదారుల్లో పదో వంతు మందికి మాత్రమే అందించి చేతులు దులుపుకొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా మేనిఫెస్టోను గాలికి వదిలేసి ప్రజలను ఇప్పటికీ మభ్యపెడుతున్నారు. దీనివల్ల జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.2 వేల కోట్ల మేర లబ్ధి అందకుండా పోయిందని అంచనా.

కూటమి సర్కారు సూపర్ సిక్స్ అమలు చేయక ఏడాది కాలంలో నష్టపోయిన బాధితులు, జరిగిన నష్టం (రూ.కోట్లలో)

| సూపర్ సిక్స్ హామీ | లబ్ధిదారులు | ఇవ్వాల్సిన సొమ్ము (అంచనా) |
|---|---|---|
| నిరుద్యోగ భృతి | 50,000 | 180 |
| తల్లికి వందనం | 1,45,000 | 217.50 |
| అన్నదాత సుఖీభవ | 14,890 | 482.50 |
| మూడు ఉచిత సిలిండర్లు | 3,90,000 | అరకొర |
| ప్రతి మహిళకు రూ.1,500 | 4,50,000 | 810 |
| మహిళలకు ఉచిత బస్సు | 9,00,000 | ఇంకా అమలు కాలేదు |

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం.. లబ్ధి (రూ.కోట్లలో)..

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి |
|---|---|---|
| వైఎస్సార్ రైతు భరోసా | 1,45,890 | 482.58 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ | 1,07,272 | 15.63 |
| పెట్టుబడి రాయితీ | 1,08,176 | 93.37 |
| ఉచిత పంటల బీమా | 2,89,745 | 1,105.40 |
| వైఎస్సార్ పంట బీమా | 72,267 | 130.95 |
| అమ్మ ఒడి | 1,45,462 | 860.563 |
| విద్యా దీవెన | 29,878 | 25.80 |
| మహిళా సంఘాలకు రుణమాఫీ | - | 1,015.96 |
| ఈబీసీ నేస్తం | 11,496 | 53.03 |
| నేతన్న నేస్తం | 17,811 | 43.33 |
| కాపు నేస్తం | 34,962 | 165.60 |



సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నాటి సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

### ప్రతి హామీ నెరవేర్చింది జగన్ ఒక్కరే..



మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. దేశంలో మరే నేతా మేనిఫెస్టోను వంద శాతం అమలు చేయలేదు. నవరత్నాలే కాకుండా మరెన్నో సంక్షేమ పథకాలను జగన్ అమలు చేసి చూపించారు.

– జానా గణేష్, బండారులంక, అమలాపురం

### మేనిఫెస్టో అమలు చేయాల్సిందే..



రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో విడుదల చేసే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చాలి. అప్పుడే రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం పెరుగుతుంది. ప్రజల్లో నమ్మకం కలుగుతోంది. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చినట్టు, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పథకాలు అమలు చేయాలి.

– ఎస్‌వీ లక్ష్మీదేవి, సూర్యారావుపేట, ఆలమూరు మండలం

## వాడపల్లి స్వామికి లక్ష్మీ కటాక్షం

- గణనీయంగా పెరిగిన ఆదాయం
- రూ.1.14 కోట్లతో సౌకర్యాల కల్పన
- ఈఓ చక్రధరరావు



విలేకర్ల మాట్లాడుతున్న ఈఓ చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని లక్ష్మీదేవి అనుగ్రహిస్తోంది. దేవస్థానం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఈ వివరాలు తెలిపారు. హుండీలు, టికెట్లు, లడ్డూ ప్రసాదం ద్వారా దేవస్థానానికి గత ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకూ రూ.17,73,72,207 ఆదాయం వచ్చిందన్నారు. నెలకు సగటున రూ.2,21,71,525 సమకూరిందన్నారు. శనివారాల్లో రూ.38,78,288 ఆదాయం లభించిందన్నారు. అలాగే, గత ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకూ రూ.26,11,62,698 రాబడి వచ్చిందన్నారు. అంతకు ముందు కాలంతో పోలిస్తే ఆదాయం రూ.8,37,90,491 పెరిగిందన్నారు. ఈ కాలంలో నెలకు సగటున రూ.3,26,45,337 వచ్చిందన్నారు. శనివారాల్లో రూ.55,86,962 మేర ఆదాయం రాగా అంతకు ముందుతో పోలిస్తే రూ.17,08,764 పెరుగుదల నమోదైందని తెలిపారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ.1.14 కోట్లతో వివిధ పనులు పూర్తి చేశామని తెలిపారు. ఆలయ నిధులు రూ.11.17 కోట్లతో చేపట్టిన పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.19.30 కోట్లతో శాశ్వత నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. కల్యాణోత్సవాలకు గత ఏడాది రూ.89,67,000, ఈ ఏడాది రూ.71,14,806 మేర ఖర్చయిందని చెప్పారు. మొత్తం మీద ఖర్చు రూ.18,52,194 తగ్గిందన్నారు. గోదాదేవి కల్యాణోత్సవాలకు గత ఏడాది రూ.99,14,800, ఈ ఏడాది రూ.54,07,220 చొప్పున ఖర్చయ్యాయని, ఈ వ్యయం రూ.45,07,580 తగ్గిందని చక్రధరరావు వివరించారు.

## నిత్య కల్యాణమూర్తీ.. గోవిందా..

- వాడపల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- రూ.57.83 లక్షల ఆదాయం



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొత్తపేట: నిత్య కల్యాణమూర్తీ.. గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణతో ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రం ప్రతిధ్వనించింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా ఇక్కడ కొలువు తీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే వాడపల్లి బాట పట్టారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము పట్టిన భక్తులు మాడ వీధుల్లో ప్రదక్షిణలు చేసి, భారీగా బారులు తీరి మరీ స్వామిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. అనేక మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో తెల్లవారుజామున ప్రధానార్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యాన అర్చకులు, వేద పండితులు స్వామివారికి సుప్రభాత సేవ, వివిధ పూజాదికాలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఆలయంలోని పలు ప్రాంతాల్లో కూలర్లు ఏర్పాటు చేశారు. మాడ వీధులు, ఆలయ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ చేశారు. విశిష్ట, ప్రత్యేక దర్శనాలు, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదాన విరాళాలు, లడ్డూ ప్రసాద విక్రయం తదితర రూపాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి దేవస్థానానికి రూ57,83,778 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ఎస్సై ఎస్.రాము ట్రాఫిక్ నియంత్రించి, శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా రాత్రి వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.

# ధర ఫుల్.. సరకు నిల్

- అమాంతం పెరిగిన రూప్‌చంద్ ధర
- కేజీ రూ.113

మలికిపురం: రూప్‌చంద్ చేపల ధరలు భారీగా పెరిగాయి. నాలుగేళ్ల క్రితం కేజీ రూ.30కి పడిపోయిన కేజీ రూప్‌చంద్ చేపలను ఎగుమతిదారులు ప్రస్తుతం రూ.114కు కొనుగోలు చేస్తున్నారు. మధ్యలో కాస్త పెరుగుదల ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ధర పలకడం ఇదే మొదటిసారని ఎగుమతిదారులు అంటున్నారు. 2020లో అత్యధికంగా కిలో రూ.70 పలికిన ఈ చేప ధర అనంతరం రూ.30 కనిష్ట స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ధర అయితే పెరిగిందిగానీ, రైతుల వద్ద సరకు లేదు. చెరువుల్లో కిలో రూప్‌చంద్ పెంపకానికి అన్ని ఖర్చులూ కలిపి రూ.80 వరకూ అవుతోంది. నాలుగేళ్లుగా ధర లేక నష్టాల బారిన పడిన రైతులు రూప్‌చంద్ పెంపకం జోలికే వెళ్లలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ధర పెరిగినా రైతుల వద్ద సరకు లేదు. ఈ చేపలకు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర ఈశాన్య రాష్ట్రాల్లో బాగా డిమాండ్ ఉంది.

### గతంలో భారీగా ఎగుమతులు

కోస్తా జిల్లాల్లో పదేళ్లుగా ఆక్వా రంగం కుదేలవుతున్న తరుణంలో రైతులు ఐదేళ్ల క్రితం ముమ్మరంగా రూప్‌చంద్ చేపల సాగు చేశారు. కోస్తా జిల్లాల నుంచి ఏటా 25 వేల టన్నుల రూప్‌చంద్ చేపలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవని అంచనా. అయితే, ధర పతనమైన తరువాత రైతులు దాని జోలికి వెళ్లలేదు. వేరే అవకాశం లేని ప్రాంతాల్లో తప్ప మిగిలిన ప్రాంతాలో ఈ చేపల సాగు నిలిపివేశారు. అయినప్పటికీ ప్రస్తుతం ఏటా 5 వేల టన్నులకు పైగా ఈ చేపల ఎగుమతులు జరుగుతున్నట్లు అంచనా. ధర బాగున్న సమయంలో ఇక్కడి రైతులు సాగు చేశారు. ఎకరం చెరువులో సుమారు 4 వేల నుంచి 5 వేల వరకూ రూప్‌చంద్ చేప పిల్లలను పెంచుతారు. ఎకరానికి నాలుగు టన్నుల పైనే దిగుబడి వస్తుంది. తెగుళ్లను తట్టుకుని ఈ చేప పెరుగుతుంది.

### ఇవీ ప్రత్యేకతలు

కొన్ని దేశాల్లో పిరాపింగా లేదా రెడ్-బెల్లీడ్ పాకు అని కూడా ఈ చేపను పిలుస్తారు. ఇది దక్షిణ అమెరికా మూలానికి చెందిన మంచినీటి చేప. రెడ్-బెల్లీడ్ పాకును అసోంలో సాధారణంగా ×రుప్చంద్ష అని పిలుస్తారు. పాకు అనేది అనేక దక్షిణ అమెరికా చేప జాతులను సూచించడానికి ఉపయోగించే సాధారణ పేరు. ప్రత్యేకమైన రుచి కలిగిన చేపల్లో రూప్‌చంద్ ఒకటి. చెరువుల్లో పెంచుతారు కాబట్టి దీనిని కోస్తాలో చెరువు చందువా అని పిలుస్తారు. సముద్ర చందువా చేపలకు పోటీగా దీనిని మత్స్యశాఖ శాస్త్రవేత్తలు ఇక్కడ ప్రవేశపెట్టారు. కోల్‌కతా నుంచి సీడ్ వస్తుంది. సముద్ర చందువా చేపలు ఒక సీజన్‌లో మాత్రమే లభిస్తాయి. రూప్‌చంద్ చేప మన దేశంతో పాటు బంగ్లాదేశ్, చైనాల్లో కూడా పెరుగుతుంది. అన్ని సీజన్లలోనూ లభిస్తుంది. ఇది భిన్నమైన నిర్మాణ శైలి కలిగి ఉన్న చేప. సముద్ర చందువాతో పాటే, చెరువు చందువా చేపను చైనీస్‌లో ప్రాంఫెట్ అని పిలుస్తారు. తెలుగులో దీనిని చందువా లేదా సందువా అని అంటారు. ఈ జాతి చేపలు కొన్ని ఎరుపు, తెలుపు, నలుపు, సిల్వర్ రంగుల్లో ఉంటాయి. చెరువుల్లోనూ, నదుల్లోనూ పెరుగుతాయి. సిల్వర్ రంగు చేపలు ఉప్పునీటిలో సైతం పెరుగుతాయి. ఎముకను కలిగి ఉండటం ఈ చేప ప్రత్యేకత. అయితే ముళ్లు గుచ్చుకుంటాయనే భయం లేకుండా ఈ చేపలను ఎక్కువగా ఇష్టంగా తింటారు. రూప్‌చంద్ మాంసంలో ఎక్కువగా ప్రొటీన్లు, విటమిన్లు లభిస్తాయి. పోషక విలువలు అధికంగా ఉండే ఈ చేపలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరం. దీనిలో ప్రత్యేకంగా అమైనో ఆమ్లాలు, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రూప్‌చంద్ చేపలో సోడియం, పొటాషియం, కాల్షియం, ఐరన్, విటమిన్-సి, విటమిన్-ఇ, శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, అన్ శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి తింటే మెదడు బాగా పని చేస్తుంది. గుండె జబ్బులకు గురి కాకుండా ఉంటారు. ఇందులో ఉండే ఐరన్, మెగ్నీషియం మానవ శరీరంలోని ఎంజైముల పని తీరును మెరుగుపరుస్తాయి.



రూప్‌చంద్ చేపలు

### పెరిగిన ధరలు

ప్రస్తుతం రూప్‌చంద్ ధరల పెరుగుదలకు పలు కారణాలు చెబుతున్నారు. ప్రధానంగా ఈ చేపల సాగు మన దేశంలోని ఆంధ్రప్రదేశ్‌తో పాటు బంగ్లాదేశ్, చైనాల్లో ఎక్కువగా ఉంది. చైనా, బంగ్లాదేశ్‌ల నుంచి దొడ్డి దారిన రూప్‌చంద్ చేపలను ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్‌కు తక్కువ ధరలకే తరలించేవారు. ఇటీవల బంగ్లాదేశ్ సరిహద్దులో వాణిజ్యం నిలిచిపోవడం వంటి కారణాలతో ప్రస్తుతం అటు నుంచి రూప్‌చంద్ దిగుమతులు నిలిచిపోయాయి. దీంతో, ఆంధ్రాలో ఈ చేపలకు గిరాకీ పెరిగిందని భావిస్తున్నారు.

## క్లుప్తంగా

### పెళ్లింట వినోదం.. అంతలోనే విషాదం


పెళ్లికి ముందు కల్యాణ వేదిక వద్ద భార్యతో కలసి డ్యాన్స్ చేస్తున్న కృష్ణ

గండేపల్లి: ఆ పెళ్లింట ఆనందంగా గడుపుతున్న వేళ అంతలోనే విషాదం చోటుచేసుకుంది. పిల్లలు, పెద్దలు, వృద్ధులు, బంధువులతో కళకళలాడుతున్న చోట అంతులేని దుఃఖం మిగిలింది. అందరితో సరదాగా గడిపిన వ్యక్తి మృత్యు ఒడికి చేరుకున్న సంఘటన ఇది. ఆ వివరాల్లోకి వెళ్తే.. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ములంపాక సురేష్ సోదరుడు కృష్ణ (48) హఠాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యు వాతకు గురయ్యాడు. గురువారం రాత్రి సమీప బంధువు వివాహ వేడుకలో కృష్ణ ఎంతో సరదాగా గడిపి, శుక్రవారం రాత్రి బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య దేవి, కొడుకు కార్తీక్, కూతురు హాసిని ఉన్నారు. మారేడుమిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా కృష్ణ పని చేస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరినీ నవ్వుతూ పలకరిస్తూ ఉండే అతను మృతి చెందడం జీర్ణించుకోలేకపోతున్నామని స్నేహితులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అతని కొడుకు 9వ తరగతి పూర్తి చేయగా, కుమార్తె ఇంటర్ ఫలితాల్లో 987 మార్కులు సాధించారు. ఈ ఆనందాన్ని పంచుకునేలోపే దూరమైపోయావా అంటూ కుటుంబ సభ్యుల రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

### పాముకాటుకు ఉపాధి కూలీ మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

కాజులూరు: పెదలంకలో పాముకాటుకు ఉపాధి కూలీ పాలిక నాగేశ్వరరావు (62) మృతి చెందాడు. స్థానికులు, ఉపాధి ఏపీఓ వెంకటలక్ష్మి కథనం ప్రకారం.. శనివారం స్థానికంగా ఉండే పంట కాలువ వద్ద ఉపాధి పనులు చేస్తుండగా పాలిక నాగేశ్వరరావును తాచుపాము కరవడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. స్థానికులు సమీపంలోని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఏపీఓ వెంకటలక్ష్మి, సర్పంచ్ చెరువూరి వెంకట సత్యనారాయణ రాజు పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మట్టి మాయం


తిమ్మరాజు చెరువు గర్భంలో జేసీబీతో మట్టి తవ్వకాలు

- తెలుగు తమ్ముళ్ల అక్రమ దందా
- సాగునీటి చెరువులో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఏలేశ్వరం: దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్టు ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల పరిస్థితి తయారైంది. రైతులకు మేలు చేస్తున్న చెరువును సైతం వదలడం లేదు. వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న చెరువులో మట్టిపై కన్నుపడింది. ఏలేశ్వరం శివారులో సుమారు 1,800 విస్తీర్ణంలో ఉన్న తిమ్మరాజు చెరువు ద్వారా సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో మట్టిని నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండలతో అనుచరులు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. ఆ ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడైన ప్రత్తిపాడుకు చెందిన వ్యక్తి మట్టి తవ్వకాల ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. రెండు జేసీబీలతో రోజుకు సుమారు 30 నుంచి 40 లారీలతో చెరువు గర్భంలోని మట్టిని తరలించేస్తున్నారు. లారీ మట్టిని రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. అధికారులకు సైతం తమ స్థాయికి మించిన మామూళ్లు అందుతుండడంతో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.


లారీతో చెరువులో మట్టి తరలింపు

#### రూ.3 కోట్ల మేర వ్యాపారం

చెరువులో మట్టిని ఇసుక బట్టీలకు విక్రయిస్తున్నారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని ఇసుక బట్టీలకు, జగ్గంపేట, పిఠాపురానికి చెరువులో మట్టిని తరలిస్తున్నారు. ఈ మేరకు సుమారు రూ. 3 కోట్ల మేర ఒప్పందం కుదిరినట్టు సమాచారం. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. ఇప్పటికే చెరువు చాలావరకూ ఆక్రమణలకు గురైందని అక్రమంగా మట్టిని తరలించడంతో చెరువు మనుగడ దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం చెరువులో నీటి నిల్వలు అడుగంటడంతో పాటు ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఇదే అదునుగా తెలుగు తమ్ముళ్లు భావించి చెరువు మట్టి తరలిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించేందుకు అందుబాటులోకి రావడం లేదు. అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఆపాలని రైతులు కోరుతున్నారు. దోపిడీదారులతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# లోక కల్యాణార్థం వేద సదస్యం


అప్పనపల్లి ఆలయంలో సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఆలయం సందడిగా మారింది. దేవస్థానం ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారికి సహస్ర నామార్చన, బాలభోగ నివేదన, చతుస్థానార్చనలు, వేద పారాయణ, హోమాలు, బలిహరణ, మంగళశాసనాలు, తీర్థ ప్రసాద గోష్ఠి, సదస్యం (పండిత సన్మానం), వేద పారాయణ, నిత్య హోమం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది వేద పండితుల ఆధ్వర్యంలో చతుర్వేద మహదాశీర్వచనంలో భాగంగా లోక కల్యాణార్థం వేద సదస్యం నిర్వహించారు.

#### ఆకట్టుకున్న కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అప్పనపల్లికి చెందిన శ్రీశేష శారద భక్త బృందం ఆలపించిన పురంధర దాసు కీర్తనలు అబ్బురపర్చాయి. మానేపల్లికి చెందిన అరుణకుమారి, జీవీ రమణ బృందం ఆధ్యాత్మిక గీతాలు ఆలపించింది. అప్పనపల్లికి చెందిన కాజులూరి మహేంద్రకుమార్ బృందం ఆధ్వర్యంలో శ్రీసీతారామ బాలభక్త బృందం కళాకారులు తమదైన శైలిలో ఆధ్యాత్మిక గీతాలను పాడారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# అంతకందకూ తెగుళ్లు

- వాతావరణ మార్పులతో ఇబ్బంది
- దెబ్బతింటున్న తోటలు
- సస్యరక్షణ అవసరమంటున్న అధికారులు


సీహెచ్ శ్రీనివాస్, ఉద్యాన అధికారి, కొవ్వూరు

పెరవలి: అంతకందకూ తెగుళ్లు వ్యాపిస్తున్నాయి.. ముప్పేట దాడి చేస్తున్నాయి.. రైతులను గుక్కతిప్పుకోకుండా మార్చుతున్నాయి.. తూర్పుగోదావరి జిల్లాలో 400 హెక్టార్లలో కంద సాగు జరుగుతోంది. ఇందులో పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, తాళ్లపూడి, కొవ్వూరు, నల్లజర్ల, చాగల్లు, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో ఎక్కువగా సాగవుతోంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఒకపక్క వర్షాలు, మరోపక్క ఎండల కారణంగా తోటలపై తెగుళ్లు ఆశిస్తున్నాయని, తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొవ్వూరు ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్ వివరిస్తున్నారు. ముఖ్యంగా ఇనుప ధాతులోపం, జింక్ ధాతులోపం, ఆకుమచ్చ తెగులు, కాండం లేక మొదలు కుళ్లు తెగులు, మొజాయిక్ తెగులు ఆశించాయని, దీని నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలిపారు. అవి ఇలా..


ఖండవల్లిలో మచ్చ తెగులు సోకిన చేను

#### ఇనుపధాతు లోపం

నీటి తడులు సక్రమంగా లేనప్పుడు ఇనుప ధాతులోపం సహజంగా కనిపిస్తుంది. ఆకులు పత్ర హరితాన్ని కోల్పోయి తెల్లగా మారతాయి. ఈ ధాతు లోపాన్ని నివారించడానికి లీటరు నీటికి 5 గ్రాముల అన్నభేది, ఒక గ్రాము నిమ్మ ఉప్పు తగిన మోతాదులో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి నీటి తడులు పెడుతూ నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

పాడి-పంట

#### జింకుధాతు లోపం

ఆకుల ఈనెలు మధ్య పసుపు వర్ణంగా మారి, క్రమేపి ఆకు మొత్తం పండి, ఎండిపోతాయి. ఈ లోపాన్ని నివారించడానికి లీటరు నీటికి మూడు గ్రాముల జింక్ సల్ఫేట్ మోతాదులో కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

#### ఆకుమచ్చ తెగులు

వర్షాకాలంలో ఈ తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. ఆకులపై చిన్న మచ్చలుగా ప్రారంభమై త్వరగా ఎదిగి, ఆకులు పండి, ఎండిపోయి దిగుబడులు బాగా తగ్గిపోతాయి. దీని నివారణకు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును పిచికారీ చేయాలి. తెగులు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల మెటలాక్సిల్ ఎమ్.జెడ్ మందును ఒకసారి మాత్రమే ఆకులు అన్నీ పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. దుంపలు తవ్వకానికి కనీసం రెండు నెలల ముందు నుంచి మందును వాడరాదు.

#### కాండం లేక మొదలు కుళ్లు

ఈ తెగులు కాండం మొదలు వద్ద ఆశించి కాండం పూర్తిగా కుళ్లి చనిపోతుంది. దీని నివారణకు మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. తెగులు ఎక్కువగా ఉన్నప్పుడు ఇదే చేలో తిరిగి ఈ పంట వేయరాదు. పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలి. తెగులు ఆశించిన చెట్టు చుట్టూ మట్టిని గట్టుగా చేసి, తడి పెట్టినప్పుడు, నీటి ద్వారా ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టాలి. తెగులు ఆశించిన చెట్టు మొదలు చుట్టూ ఉన్న మట్టిని లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేక 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కలిపిన ద్రావణంలో బాగా తడిపి తెగులును అరికట్టవచ్చు.


ఖండవల్లిలో కాండం కుళ్లుతో చనిపోతున్న మొక్క


ఎల్లో మొజాయిక్ తెగులు సోకి గిడసబారి ఇలా..

#### మొజాయిక్ తెగులు

తెగులు ఆశించిన మొక్కల ఆకులు పత్ర హరితాన్ని కోల్పోయి, తెలుపు, పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా, ముడుచుకుపోయినట్టు ఉంటాయి. ఈ వైరస్ విత్తనపు దుంపలు, పేను బంక పురుగుల ద్వారా వ్యాపిస్తుంది. దీని నివారణకు విత్తన దుంపలను తెగులు సోకిన తోటల నుంచి సేకరించాలి. పేను బంక నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమెటాన్‌లను 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

# ఇంటర్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీలో 470కి 467 మార్కులను సీహెచ్ సందీప్, బత్తుల తన్మయిరిత్విక, ముత్యాల హర్షిత, సింగులూరి తేజ, ముదెనుస్నీషా ఖాన్, పర్చూరి పునీత వెంకటసాయి, కిల్లంపల్లి రేవతిదేవి, జె.గోపికధమని, వడ్డి జ్వలితసాయిశివవాణి, మద్దు సూర్యదేవ్, కె.సత్యప్రియ, గెద్దం రాజనవీన్‌తేజ, దాడి దినేశ్వర్, ఎ.వీరవెంకట సాయిలిఖిత, కేశన తపస్వి, డి.దీపిక, కొవ్వూరి హాసిని, దీప్తిమహంతి సాత్విక్ సాధించారన్నారు. 466 మార్కుల పైన 155 మంది, 465 మార్కుల పైన 506 మంది, 463 మార్కులపైన 1,224 మంది, 460 పైన 177 మంది, 450 పైన 204 మంది పొందారన్నారు. బైపీసీలో 440కి 437 మార్కులను మహమ్మద్ మనీష, గంగేయుల కృష్ణచందన, కాగ గాయత్రి, గంపల వీరవెంకట లక్ష్మణ్ సాధించారన్నారు. 435 పైన 90 మంది, 430 పైన 292 మంది, 400 పైగా మార్కులు 501 మంది సాధించారని నున్న తిరులమరావు వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలు అభినందించారు. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

**DISTANCE EDUCATION**
■ ఓపెన్ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడ్స్, మా ఆఫీసులు : కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్ : 82975 92043, 99494 82757 [V- 2817]

Real Estate

**FLAT FOR SALE**
■ RJY కవలగొయ్యిలో PJ కనస్ట్రక్షన్‌లో E/F Flats మరియు బాలాజీపేట, J.N. రోడ్‌లో Flats అమ్మకానికి కలవు. ✆ : 96524 22715, 80749 76722 [R-1630]

■ Prime Locations Maddilapalam, Behind CMR, 2BHK,738 Sft,47 Sq.yds ,East facing with Car parking, 100Sft, flat for sale.Ph:9381043689,9848133304 [H-15919]

**HOUSE FOR SALE**
■ రాజమండ్రి, తిలక్‌రోడ్‌లో రూపా సప్లై కంపెనీ ప్రక్కనగల G+2 కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడను. ✆ : 70133 71110 [SCA25004186]

**LAND FOR SALE**
■ మల్లిశాల గ్రామం (జగ్గంపేట – గోకవరం) తారు రోడ్డుకి 1 కిమీ దూరంలో 3 ఎకరాలు మామిడి, జీడి మామిడి తోట అమ్మకం. ✆ :96669 73564. [SCA25004737]

■ అమలాపురం : కలెక్టర్ గారి క్యాంపు ఆఫీసు దగ్గరలో కొంకాపల్లిలో సౌత్ ఫేసింగ్ 11 సెం॥ స్థలం అమ్మకం. ✆ : 99496 59976, 97052 03494 [SCA25004649]

■ కాకినాడ, నడకుదురు వద్ద శుభం కొంటి లే అవుట్‌కు మరియు NH-216 బైపాస్ రోడ్డు దగ్గరగా ఇరువైపులా 7 ఎకరాలు మరియు 2 ఎకరాలు లే అవుట్‌లకు అనువైన భూమి అమ్మకమునకు కలదు. సంప్ర॥ 92461 99099 [R-30]

■ సామర్లకోట RAK సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ADB రోడ్ నుండి 2వ బిట్ N/F రోడ్‌తో లేఅవుట్‌లకు, గొడౌన్‌లకు అనుకూలమైన 5.21 ఎకరాలు భూమి (జగ్గమ్మ గారి పేట నందు) అమ్మకము. సంప్ర॥ 92461 99099 [R-31]

**PLOT FOR SALE**
■ కాకినాడ దేవాలయం వీధిలో 330 చ గ ఫ్లాట్ అమ్మకమునకు కలదు. CMR మాల్ ఎదురు డైరెక్ట్ పార్టీ మాత్రమే. 9949507969 [SCA-25004587]

**TO-LET**
■ కాకినాడ శాంతినగర్ వాటర్ ట్యాంక్ ఎదురుగ (సాయిబాబా గుడి ప్రక్కన) G+3 బిల్డింగ్, 2 ఫ్లోర్స్ 2120 SFT & 3 ఫ్లోర్ 2120 SFT లో హాస్పిటల్స్/ ఆఫీసులకు/ స్కూల్స్‌కు, కారు పార్కింగ్ సదుపాయలతో సం:9346431236 [SCA-25003805]

Wanted

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచ్). శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్. భో+ వసతి + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 8247 500792, 8247500574 [B-1275552]

■ గోదారోళ్ళ సుబ్రహ్మణ్యం గారి భోజనం హోటల్ NH-65 చౌటుప్పల్, లక్కారం (V.V.R Gardens) వద్ద పనిచేయుటకు 30 సం॥లోపు స్త్రీ/పురుషులు కావలెను. భోజనం మరియు వసతి సౌకర్యం కలదు. జీతం : 10,500/-. సెల్ : 96666 36108, 96666 83108 [YA-2866]

■ శ్రీదేవి ఫంక్షన్ హాల్‌నందు పనిచేయుటకు గార్డెనింగ్, సివిల్ & క్లీనింగ్ కొరకు వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, జీతం: యువకులకు 18,000/-, మధ్యవయస్కులకు 15,000/-, పెద్దవారికి 12,000/-, జి.మామిడాడ లోనే నివాసం ఉండాలి. Cont ✆ : 94909 98888 [R-34]

■ ప్రముఖ ఆఫీసు నందు పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. బైక్, జీతం: 15వేలు నుండి 20వేలు వరకు. సంప్ర॥ 9390916550, 7569756990 [SCA25004702]


■ ప్రముఖ స్టీల్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహించుటకు (Male / Female) అభ్యర్థులు కావలెను. టూవీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. సెల్ : 8121213311, 9010559955. steelbuddy144@gmail.com [SCA-25004400]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ.: 400/-
అదనపు లైనుకు రూ.: 90/-
GST 5% Extra
రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం: 99516 02838
తుని, జగ్గంపేట, యానాం: 90109 67896
అమలాపురం, ముమ్మిడివరం: 97053 47414
పి.గన్నవరం: 97057 49718, రాజోలు: 97053 45456
మండపేట: 99516 02941
రామచంద్రపురం: సెల్: 99516 02936
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010


# భారం చెత్తగించండి..

- రత్నగిరిపై పారిశుధ్యానికి పెరిగిన ఖర్చులు
- కొత్త టెండర్ అంచనాల ప్రకారం నెలకు రూ.80 లక్షలు


అన్నవరం దేవస్థానం


కొండ దిగువన నిర్మించిన భక్తుల విశ్రాంతి షెడ్లు

అన్నవరం: సత్యదేవునికి వచ్చే ఆదాయం కన్నా అయ్యే ఖర్చు ఎక్కువ కనిపిస్తోంది. ఏ నిర్మాణాలూ చేపట్టకుండా, సీజీఎఫ్, ఆడిట్ ఫీజు, అర్చక వెల్ఫేర్ ట్రస్ట్‌లకు చెల్లింపులు చేయకుండా అలా నెట్టుకుంటూ వెళ్తే సరి.. లేకపోతే బండి ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో దేవస్థానానికి మరింత ఖర్చులు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ మరింత భారం కానుంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. అన్నవరం శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంతో సహా రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాల్లో శానిటరీ మెటీరియల్‌తో సహా క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుధ్య పనులు నిర్వహించేందుకు గత ఏప్రిల్‌లో పిలిచిన సెంట్రలైజ్డ్ టెండర్ ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మరికొన్ని అంశాలను కలిపి త్వరలో రీటెండర్ పిలవనుంది.

#### కొలిక్కి రాని టెండర్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం శానిటరీ టెండర్లు పిలిచి ఖరారు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని దాదాపు ఆరు నెలలు ఆలస్యం చేశారు. అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకాతిరుమల, విజయవాడ దుర్గగుడి, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో పారిశుధ్య పనులు, వివిధ సత్రాల్లో హౌస్ కీపింగ్, రహదారులు, టాయిలెట్ల క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ తదితర పనులు నిర్వహించడానికి రెండేళ్ల కాల పరిమితికి గత ఏప్రిల్‌లో పిలిచిన టెండర్‌ను రద్దు చేశారు. సత్రాల్లో ఏసీలు, విద్యుత్ ఉపకరణాల నిర్వహణతో పాటు సిబ్బందికి వారాంతపు సెలవులు, మహిళా సిబ్బందికి నెల నెలా వచ్చే శారీకర మార్పులప్పుడు ఇవ్వాల్సిన సెలవులకు గాను అదనపు సిబ్బందిని కూడా కలుపుతూ కొత్తగా టెండర్ పిలవనున్నారు.

#### అభ్యంతరాల నేపథ్యంలో..

గత ఏప్రిల్‌లో పిలిచిన శానిటేషన్ టెండర్లలోని ప్రీ బిడ్ సమావేశంలో పాల్గొన్న పలు సంస్థల ప్రతినిధులు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇందులో సిబ్బందికి వీక్లీ ఆఫ్ ఇవ్వాలంటూ నిబంధన చేర్చారని, అటువంటప్పుడు సిబ్బందిని పెంచకుండా వీక్లీ ఆఫ్ ఎలా ఇవ్వాలంటూ వారి నుంచి ప్రశ్న వచ్చింది. దీంతో ఆ టెండర్‌ను రద్దు చేసి కొత్త నిబంధనలు, సిబ్బంది పెంపుదలతో కొత్త టెండర్ పిలవడానికి ప్రభుత్వం దేవదాయశాఖకు అనుమతి ఇచ్చింది.

#### పెరగనున్న సిబ్బంది, ఖర్చులు

అన్నవరం దేవస్థానంలో ప్రస్తుతం 349 మంది మాత్రమే పని చేస్తుండగా, 375 మంది సిబ్బంది అవసరమని లెక్కేశారు. కొత్త టెండర్‌లో సిబ్బంది పెరిగితే శానిటరీ కాంట్రాక్ట్ వ్యయం కూడా పెరగనుంది. కాగా, రెండేళ్లు శానిటరీ కాంట్రాక్ట్ నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థ నెలకు రూ.49 లక్షలకు పారిశుధ్య పనులు నిర్వహించింది. నవంబర్‌తో ఆ సంస్థ టెండర్ ముగిసినా ఫిబ్రవరి నెలాఖరు వరకూ కొనసాగించింది. ఆ సంస్థ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగాక దేవస్థానం తాత్కాలికంగా రెండు నెలల నుంచి గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీస్‌కు నెలకు రూ.59 లక్షలు చెల్లిస్తున్నారు. మరో రూ.12 లక్షలు శానిటరీ మెటీరియల్‌కు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం మీద రూ.71 లక్షల ఖర్చు అవుతోంది. పారిశుధ్య పనుల్లో అత్యాధునిక మిషనరీలు ఉపయోగించాలనే షరతుతో పాటు, శానిటరీ సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం కచ్చితంగా జీతాలు చెల్లించాలనే షరతుతో ఈ సారి రూ. 80 లక్షలకు పైగా టెండర్ కోడ్ అయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అంటే ఏడాదికి దాదాపు రూ. పది కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. కొత్త భవనాలు రావడంతో పారిశుధ్యానికి అక్కడా సిబ్బందిని పెట్టాల్సి ఉంది. దేవస్థానానికి 2025–26 సంవత్సరం మొత్తం బడ్జెట్ రూ.171.33 కోట్లు కాగా, అందులో పారిశుధ్య నిర్వహణకు రూ.7.5 కోట్లు కేటాయించారు. ఇప్పుడు పారిశుధ్య నిర్వహణ వ్యయం రూ.పది కోట్ల వరకూ పెరిగే అవకాశం ఉంది.

# వెబ్ వద్దు.. మాన్యువల్ ముద్దు

- ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనలు
- నేడు డీఈఓ కార్యాలయం ముట్టడి


రాయవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

రాయవరం: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ విధానంలో బదిలీలు చేపట్టకుండా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ఉన్నతాధికారులు సూచించడంపై ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. మే 19, 20 తేదీల్లో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో జరిగిన చర్చల సందర్భంగా ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో బదిలీలు చేపట్టేందుకు అంగీకరించినట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. అయితే ఇప్పుడు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించకుండా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలంటూ చెప్పడం హామీని ఉల్లంఘించినట్లవుతుందని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేసి మండల స్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆదివారం కాకినాడలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చినట్లు ఐక్యవేదిక నాయకులు పి.సురేంద్రకుమార్, పోతంశెట్టి దొరబాబు, దీపాటి సురేష్‌బాబు, జి.నరేష్‌కుమార్ తెలిపారు.